క్లుప్తంగా

నిత్యాన్నదాన పథకానికి విరాళం



దాత లలితకు స్వామివారి చిత్రపటం ఇస్తున్న అర్చకులు

అయినవిల్లి: అయినవిల్లి విఘ్నేశ్వర స్వామివారి ఆలయంలో నిత్యాన్నదాన పథకానికి అల్లవరం గ్రామ వాస్తవ్యులు మూల లలిత, ఆమె కుటుంబ సభ్యులు బుధవారం రూ.20 వేల విరాళం అందజేశారు. ఈ సొమ్మును ఆలయ అర్చకుడు వినాయకరావుకు ఇచ్చారు. దాతను సత్కరించి స్వామివారి చిత్రపటం, ప్రసాదం అందించారు. అలాగే కవల పిల్లలకు పటిక బెల్లం, చిల్లర నాణేలను తులాభారంగా సమర్పించారు.

నేడు హుండీల ఆదాయం లెక్కింపు

మామిడికుదురు: అప్పనపల్లి శ్రీబాల బాలాజీ స్వామివారి ఆలయంలో హుండీల ఆదాయం గురువారం లెక్కించనున్నట్లు ఆలయ ఈఓ ముదునూరి సత్యనారాయణ రాజు బుధవారం తెలిపారు. ఉదయం 9 గంటలకు దేవదాయ, ధర్మదాయ శాఖాధికారులు, ప్రజాప్రతినిధులు, భక్తులు, స్థానికుల సమక్షంలో హుండీలను తెరిచి లెక్కిస్తామన్నారు. నిబంధనలకు అనుగుణంగా ఈ లెక్కింపు జరుగుతుందన్నారు.

తీర్థం పనులకు టెండర్ల ఖరారు



అంతర్వేది ఆలయంలో టెండర్లు ఖరారు చేస్తున్న దేవదాయ శాఖ అధికారులు

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనరసింహ స్వామివారి దేవస్థానంలో ఫిబ్రవరి 4వ తేదీ నుంచి 13వ తేదీ వరకూ నిర్వహించే స్వామివారి వార్షిక కల్యాణ మహోత్సవాలకు గతంలో వాయిదా పడిన వివిధ పనులకు బుధవారం టెండర్లను అధికారులు ఖరారు చేశారు. ఆలయ ప్రాంగణంలో ఈ మేరకు ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ రామలింగేశ్వరరావు పర్యవేక్షణలో ఆయా పనులకు టెండర్లు ఖరారు చేశారు. లడ్డూ ప్రసాదం తయారీకి లేబర్ కాంట్రాక్ట్, విద్యుత్ అలంకరణ, షామియానాలు, వంట పాత్రలు, సర్వే బాదులు సరఫరా చేయడం, ఫొటోలు, వీడియోలు తీయడానికి సంబంధించిన టెండర్లు ఖరారు చేసినట్టు అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ తెలిపారు. ఎంపీటీసీ బైరా నాగరాజు, దేవస్థానం కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆబోతుకు దశదిన కర్మ



పడమటిపాలెంలో ఆబోతుకు దశదిన కర్మ చేస్తున్న గ్రామస్తులు

మలికిపురం: మండలంలోని పడమటిపాలెం గ్రామంలో ఇటీవల మృతి చెందిన ఆబోతుకు గ్రామస్తులు దశదిన కర్మ కార్యక్రమం నిర్వహించారు. గత కొన్నేళ్లుగా ఈ గ్రామంలో ఉంటున్న ఆబోతు ఇటీవల అనారోగ్యంతో కాలం చేసింది. దీంతో ఆ గ్రామస్తులు పదో రోజైన బుధవారం దశదిన కర్మ నిర్వహించారు. అనంతరం సుమారు 500 మందికి అన్నదానం చేశారు.

యువత సన్మార్గంలో నడవాలి



మలికిపురం క్రిస్మస్ వేడుకల్లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దేవవరప్రసాద్

మలికిపురం: యువత సన్మార్గంలో నడవాలని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. పాస్టర్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో క్రిస్మస్ ఆరాధన మలికిపురం జీపీఆర్ గ్రౌండ్‌లో బుధవారం జరిగింది. మలికిపురంలో శ్మశాన వాటిక ఏర్పాటు, క్రైస్తవ సువార్త సభల నిర్వహణకు కమ్యూనిటీ హాలు నిర్మాణం చేపట్టాలని ఎమ్మెల్యేను స్థానిక క్రైస్తవులు కోరారు. ముఖ్య ప్రసంగీకులు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ మండల పాస్టర్ ఫెలోషిప్ అధ్యక్షుడు నల్లికిశోర్ అధ్యక్షుడు వహించగా జిల్లా పాస్టర్ ఫెలోషిప్ అధ్యక్షుడు డాక్టర్ డానియల్ పాల్, రాష్ట్ర మార్క్‌ఫెడ్ డైరెక్టర్ గుండుబోగుల పెద్దకాపు, గద్దం తులసి భాస్కరరావు, సరెళ్ల విజయప్రసాద్, గెద్దం ఫిలిప్‌రాజు, నల్లి శివకుమార్, పాస్టర్స్ ఫెలోషిప్ ఉపాధ్యక్షుడు నల్లి శాంతరాజు తదితరులు పాల్గొన్నారు. అనంతరం పాటల పోటీల్లో విజేతలకు మలికిపురం రోటరీ క్లబ్ ప్రతినిధి నల్లి శివకుమార్ సమకూర్చిన బహుమతులను అందించారు.

పిల్లలకు టీకాలు వేయించాలి

అంబాజీపేట: పుట్టిన బిడ్డ నుంచి 16 ఏళ్ల పిల్లలు రోగాల బారిన పడకుండా టీకాలు వేయించాలని కమ్యూనిటీ హెల్త్ అధికారి బి.అప్పారావు అన్నారు. మాచవరం 1, 4 సచివాలయాల వద్ద టీకాలపై అవగాహన కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు.

ఆశలపై అల్పపీడనం

- రైతులను కలవరపెడుతున్న వాతావరణం
- ఆదరాబాదరాగా నూర్పిళ్లు
- పలు గ్రామాల్లో పనలపైనే పంట

మామిడికుదురు: రైతుల ఆశలపై అల్పపీడనం నీళ్లు చల్లుతోంది.. ఆరుగాలం శ్రమించి పండించిన పంట చేతికందే సమయంలో కలవరపాటుకు గురిచేస్తోంది. దట్టమైన మేఘాలతో బుధవారం కురిసిన చినుకులు రైతుల గుండెల్లో రైళ్లు పరుగెత్తిస్తున్నాయి. పలు గ్రామాల్లో రైతులు పంటను కోత కోసి పనలపై ఉంచారు. కళ్లాల్లో ధాన్యం రాశులు ఎక్కడికక్కడే ఉండిపోయాయి. ఈ పరిస్థితుల్లో రైతులు ధాన్యం తడవకుండా రాశులపై బరకాలు కప్పారు. అల్పపీడనం మరింత తీవ్రమవుతుందని, భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్న వాతావరణ శాఖ హెచ్చరికలు రైతులకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. మామిడికుదురు మండల పరిధిలో 2,560 ఎకరాల విస్తీర్ణంలో వరి పండించారు. ఇందులో 1100 ఎకరాల్లో కోతలు పూర్తయ్యాయి. కోత కోసిన పంటలో ఎక్కువ భాగం పనలపై ఉండడంతో పాటు నూర్చిన ధాన్యం కళ్లాల్లోనే ఉంది. 70 టన్నులకు పైగా ధాన్యం కళ్లాల్లో ఉందని అధికారులు చెబుతున్నా వాస్తవానికి ఇంకా ఎక్కువ మొత్తంలోనే ధాన్యం పంట పొలాల్లో ఉండిపోయింది.



మామిడికుదురులో పంటను సురక్షిత ప్రాంతానికి తరలిస్తున్న కూలీలు



లూటుకుర్రులో పనలపై పంట

ప్రస్తుత పరిస్థితి ఇదీ..

మామిడికుదురు, నగరం, మొగలికుదురు, పెదపట్నం, పాశర్లపూడి, లూటుకుర్రు, గెద్దాడ గ్రామాల్లో సగానికి పైగా పంట కోత కోయాల్సి ఉంది. అల్పపీడనం ప్రభావంతో కూలీలకు డిమాండ్ ఏర్పడింది. ఎక్కువ కూలీ ఇచ్చి కోత కోసిన పంటను ఒబ్బిడి చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. యంత్రాల ద్వారా కోత కోసిన పంటకు సంబంధించిన ధాన్యం తేమ శాతం ఎక్కువ ఉందన్న కారణంగా దానిని ఇంకా పట్టుబడి పట్టలేదని వాపోతున్నారు. గత నెలలో ఏర్పడిన తుపాను గండం నుంచి తక్కువ మొత్తంలో నష్టం నుంచి గట్టెక్కామని, ఈ సారి అల్పపీడనం ఏం చేస్తుందోనన్న భయం రైతులను వెంటాడుతోంది.

అకాల వర్షానికి తడిసిన ధాన్యం



అయినవిల్లిలో వర్షానికి తడిసిన ధాన్యాన్ని ఆరబెడుతున్న కూలీలు

అయినవిల్లి: అకాల వర్షానికి మండలంలోని పలు గ్రామాల్లో ధాన్యం రాశులు, బస్తాలు తడిచి ముద్దయ్యాయి. బుధవారం తెల్లవారుజామున అయినవిల్లి, సిరిపల్లి, నేదునూరు, నల్లచెరువు, కె.జగన్నాథపురం తదితర గ్రామాల్లో వర్షం కురిసింది. దీంతో ధాన్యం రాసులు, బస్తాలు తడిసిపోయాయి. వీటిని ఒబ్బిడి చేసుకునే పనిలో రైతులు బిజీగా ఉన్నారు. ఈ సారి రెండు సార్లు అకాల వర్షం వచ్చి తమను నష్టాల పాల్జేసిందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

పనలపైనే మూడెకరాలు



మూడెకరాల పంట కోత కోశాం. ప్రస్తుతం పనలపై ఉంది. దానిని వర్షం నుంచి రక్షించేందుకు కుప్పగా వేస్తున్నాం. అకాల వర్షంతో కూలీలు దొరకడం లేదు. ఎక్కువ కూలీ ఇచ్చి పంటను కాపాడుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఎకరానికి కోతతో పాటు కూలీలకు రూ.15 వేల నుంచి రూ.18 వేలు ఖర్చయ్యేది. కానీ అల్పపీడనంతో ఖర్చు పెరిగిపోయింది. దిగుబడి చూస్తే అంతంత మాత్రంగానే ఉంది.

– నల్లా పెద్దకాపు, రైతు, మామిడికుదురు

పంట చేతికొచ్చే దశలో..



ప్రకృతి వైపరీత్యాలు ప్రతి ఏడాది మమ్మల్ని ఇబ్బంది పెడుతూనే ఉన్నాయి. పంట చేతికొచ్చే దశలో తుపాన్లు ఏర్పడడం వల్ల తీవ్రంగా నష్టపోతున్నాం. నాలుగెకరాల్లో కోత కోసిన పంట పనలపై ఉంది. ఈ పరిస్థితుల్లో అల్పపీడనం ఏర్పడింది. దీనివల్ల ఆదరా బాదరాగా పంటను ఒబ్బిడి చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఆరుదల లేకపోవడంతో ధాన్యం వెంటనే అమ్మే పరిస్థితి లేదు.

– పినిశెట్టి నాగబాబు, రైతు, మామిడికుదురు

తేమ ఎక్కువ ఉండడంతో..



పదెకరాల్లో పంట సాగు చేశా. ప్రస్తుతం పంట అంతా కోత కోశాం. కొంత పనలపై ఉంది. మరి కొంత మాసూళ్లు పూర్తయ్యాయి. ఇది నాలుగు రోజులవుతుంది. కానీ ధాన్యంలో తేమ శాతం ఎక్కువగా ఉందని పట్టుబడి పట్టలేదు. దీంతో ధాన్యం కళ్లంలోనే ఉండిపోయింది. ఈ పరిస్థితుల్లో వర్షం వస్తే మా పరిస్థితి ఏంటో అర్థం కావడం లేదు.

– కదలి బాబూరావు, రైతు, నగరం

మహా గర్జనను విజయవంతం చేయాలి



పి.గన్నవరంలో మాలల మహాగర్జన కరపత్రాలను విడుదల చేస్తున్న మాల మహానాడు నాయకులు

పి.గన్నవరం: గుంటూరులో ఈ నెల 15న జరగనున్న మాలల మహా గర్జనను విజయవంతం చేయాలని మాలల జేఏసీ జిల్లా అధ్యక్షుడు పండు అశోక్ పిలుపునిచ్చారు. దీనికి సంబంధించిన కరపత్రాలను స్థానిక మూడు రోడ్ల సెంటర్లో మండల మాలల జేఏసీ కన్వీనర్ సాధనాల రమేష్, మాల మహానాడు అధ్యక్షుడు యన్నపు పెద్ద, నాయకులు నక్కా వెంకటేశ్వరరావు, కోట విజయ కుమార్ తదితరులు విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రాణాలైనా అర్పించి ఎస్సీ వర్గీకరణను అడ్డుకుంటామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. మాలలను అణగదొక్కేందుకు రాష్ట్ర ప్రభుత్వం కుట్ర పన్నుతుందని అన్నారు. మాలలంతా ఐక్యంగా ఉండి ప్రభుత్వం నియమించిన ఏకసభ్య కమిషన్‌ను రద్దు చేసి, వర్గీకరణను విరమించుకునే వరకూ పోరాటాలు సాగించాలని వారు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పుచ్చకాయల సత్యనారాయణ, యన్నాబత్తుల నాగరాజు, సబ్బితి చినబాబు, రాజేంద్రప్రసాద్, గోగి రాంబాబు, కోల్లే సూర్యనారాయణ, శ్రీను, కాండ్రేగుల అనంతబాబు, గణపతి, సాధు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా విజయదుర్గమ్మ తీర్థం



బదుగువానిలంకలో విజయదుర్గమ్మ తల్లి ఆలయం వద్ద భక్తుల సందడి



విజయదుర్గమ్మ వారు

ఆలమూరు: బదుగువానిలంకలో విజయదుర్గమ్మ తీర్థం బుధవారం అత్యంత వైభవంగా జరిగింది. లంక గ్రామాల ఉద్యాన రైతుల ఇలవేల్పుగా భావించే అమ్మవారికి నిర్వహించే జాతర, తీర్థ మహోత్సవాలకు ప్రత్యేకత ఉంది. కోరిన కోర్కెలు తీర్చే అమ్మవారిని దర్శించుకునేందుకు సమీప గ్రామస్తులే కాకుండా ఆత్రేయపురం, ఆలమూరు, కడియం, రావులపాలెం, కపిలేశ్వరపురం తదితర మండలాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు విచ్చేసి ప్రత్యేక పూజలు చేశారు. విజయదుర్గమ్మను దర్శించుకున్న భక్తులు తమ మొక్కులను తీర్చుకుని నైవేద్యాలను సమర్పించారు. చిన్న పిల్లలకు తమ తల్లిదండ్రులు పటిక బెల్లాన్ని తులాభారంగా అందించారు. మంగళవారం రాత్రి జాతర అత్యంత వైభవంగా జరిగింది.

రాష్ట్ర స్థాయి పోటీలకు పల్లిపాలెం విద్యార్థులు



రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించిన విద్యార్థినులతో హెచ్‌ఎం రామచంద్రరావు, ఉపాధ్యాయులు

మలికిపురం: కౌశల్ ప్రతిభ రాష్ట్ర స్థాయి పోటీలకు గూడపల్లి పల్లిపాలెం ఉన్నత పాఠశాల విద్యార్థులు అర్హత సాధించారు. పాఠశాలకు చెందిన తొమ్మిదో తరగతి విద్యార్థులు పెచ్చెట్టి లక్ష్మిశ్రీ, పెచ్చెట్టి శ్రీరమ్యలు రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించినట్లు జిల్లా విద్యా శాఖాధికారి ఎస్‌కే సలీం బాషా బుధవారం తెలిపినట్లు పాఠశాల హెచ్‌ఎం ఆచంట రామచంద్రరావు, ఎస్‌వీఎస్‌ఎన్ మూర్తి తెలిపారు. ఈ నెల 29 తేదీ నుంచి జిల్లా స్థాయి పోటీలు జరుగుతాయన్నారు. అర్హత సాధించిన విద్యార్థులను పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.

ఆదుర్రులో ఘనంగా వేద పారాయణ

మామిడికుదురు: ఆదుర్రు గ్రామంలోని శ్రీసర్వమంగళ పార్వతీ విశ్వేశ్వరస్వామి ఆలయంలో బుధవారం వేద పారాయణ ఘనంగా జరిగింది. లోక కల్యాణార్థం ఘనాపాఠి ఉపాధ్యాయుల వెంకటలక్ష్మీ నృసింహ సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో పలువురు ప్రముఖులు వేద పారాయణ చేశారు. గీతా జయంతిని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమం ఈ నెల 17వ తేదీ వరకూ జరుగుతుందని ఆలయ కమిటీ తెలిపింది. ఇందులో భాగంగా గురు వందనం, గణపతి పూజ, గోపూజ, విశ్వేశ్వరస్వామికి అభిషేకాలు వైభవంగా జరిపించారు. పలువురు భక్తులు వేద పారాయణంలో పాల్గొని వేదం గొప్పతనాన్ని తెలుసుకున్నారు.

భక్తిశ్రద్ధలతో గీతా జయంతి

ఆలమూరు: పెదపళ్లలో గీతా జయంతిని ఘనంగా నిర్వహించారు. స్థానిక శ్రీరుక్మిణీ సత్యభామా సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో గీతామాతకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మహిళల గీతా పఠనం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. ఆలయ పురోహితులు పెదపూడి వీర వెంకట సత్యనారాయణ మాట్లాడుతూ భగవద్గీతను మార్గదర్శిగా మలుచుకోవాలన్నారు. గ్రామం నలుమూలల నుంచి అనేక మంది భక్తులు విచ్చేసి గీతా జయంతి మహోత్సవాన్ని వీక్షించారు.



భగవద్గీత పఠనం చేస్తున్న సుందర శ్రీనివాసదాస్ ప్రభూజీ



ఆదుర్రులో వేద పారాయణ చేస్తున్న పండితులు

భగవద్గీత పారాయణ

అయినవిల్లి: భగవద్గీత పఠనంతో శ్రీకృష్ణ ధామం చేరుకోవచ్చని నల్లచెరువు అంతర్జాతీయ శ్రీకృష్ణ మందిర్ నిర్వాహకులు, ప్రభూజీ సుందర శ్రీనివాస దాస్ అన్నారు. బుధవారం నల్లచెరువు శ్రీకృష్ణ మందిరంలో సామూహిక భగవద్గీత పారాయణ చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసదాస్ మాట్లాడుతూ శ్రీకృష్ణుని తత్వం భగవద్గీతలో ఇమిడి ఉందన్నారు. ప్రతి ఒక్కరూ హరేకృష్ణ మంత్ర పఠనం చేయాలన్నారు. అనంతరం శ్రీకృష్ణ భగవానునికి విశేష పూజలు, అభిషేకాలు చేశారు. పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని స్వామివారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

రెవెన్యూ రికార్డుల స్వచ్ఛీకరణే లక్ష్యం



కాట్రేనిపాడు సదస్సులో మాట్లాడుతున్న తహసీల్దార్ ప్రసాద్



నగరం సదస్సులో దరఖాస్తు స్వీకరిస్తున్న ప్రత్యేకాధికారి రామ్మోహనరావు

అంబాజీపేట: రెవెన్యూ రికార్డుల స్వచ్ఛీకరణే లక్ష్యంగా గ్రామ రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ జె.వెంకటేశ్వరి అన్నారు. పుల్లేటికుర్రులో సర్పంచ్ జల్లి బాలరాజు అధ్యక్షతన రెవెన్యూ గ్రామసభ బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ఈ సదస్సుల ద్వారా రీ సర్వేలో తలెత్తిన భూ హెచ్చుతగ్గులను సరి చేస్తారన్నారు. రెవెన్యూ రికార్డుల్లో లోపాలు లేకుండా పక్కాగా రూపొందిస్తున్నామన్నారు. ఎంపీటీసీ సభ్యులు వడలి కృష్ణమూర్తి, పబ్బినీడి రాంబాబు, ఆర్ఐ కె.ఏడుకొండలు, పంచాయతీ కార్యదర్శి లక్ష్మీపతి పాల్గొన్నారు.

మామిడికుదురు: రెవెన్యూ సదస్సుల ద్వారా సమస్యలు పరిష్కారమవుతాయని మండల ప్రత్యేకాధికారి ఎస్‌జేవీ రామ్మోహనరావు సూచించారు. నగరం గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద రెవెన్యూ సదస్సు జరిగింది. పలు సమస్యలకు సంబంధించి రైతుల నుంచి తహసీల్దార్ వైవీ సుబ్రహ్మణ్యాచార్యులు అర్జీలను స్వీకరించారు. రెవెన్యూ సదస్సులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సదస్సులో సర్పంచ్ జాలెం రమణ కుమారి తదితరులు పాల్గొన్నారు.

అయినవిల్లి: తన భూమి రైల్వే లైన్‌కు కేటాయించిన స్థలం సర్వే నంబర్‌లో చూపిస్తుందని, దానిని తన పేరుపై ఆన్‌లైన్‌లో మార్చాలని ఓ మహిళ రెవెన్యూ సదస్సులో తహసీల్దార్ సీహెచ్ నాగలక్ష్మమ్మకు ఫిర్యాదు చేశారు. సిరిపల్లిలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. అనంతరం క్షేత్ర స్థాయిలో సమస్యలను సమీక్షించారు. మండల ప్రత్యేక అధికారి సత్యనారాయణ పాల్గొన్నారు.

రాజోలు: సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని రాజోలు తహసీల్దార్ ఎస్‌వీఎస్ ప్రసాద్ అన్నారు. బుధవారం కాట్రేనిపాడు గ్రామంలో నిర్వహించిన సదస్సులో రెవెన్యూ, దేవదాయ, పంచాయతీ అధికారులు పాల్గొన్నారు. రెవెన్యూ శాఖకు సంబంధించి 19 దరఖాస్తులు, రేషన్ కార్డుల కోసం 20 మంది, గృహ నిర్మాణ మంజూరు కోసం 10, పింఛన్ల కోసం 30, వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణం కోరుతూ ఇద్దరు దరఖాస్తులు అందజేశారు. సదస్సులో అందజేసిన దరఖాస్తులను 45 రోజుల్లో పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ వివరించారు. సర్పంచ్ అడబాల శ్రీనివాసరావు, దేవదాయ శాఖ ఈఓ ఎస్‌వీఎస్ఎస్ఎన్ రాజు పాల్గొన్నారు.

కుల మతాలకు అతీతంగా 'గాడ్ ఫర్‌గివ్స్' సేవలు



అనాథ బాలలతో మాట్లాడుతున్న జాన్ వెస్లీ

రాజోలు: బిషప్ శ్రావణ్‌కుమార్ ఏర్పాటు చేసిన గాడ్ ఫర్‌గివ్స్ ఫౌండేషన్ కుల మతాలకు అతీతంగా సేవలు అందిస్తుందని వైఎస్సార్ సీపీ క్రిస్టియన్ మైనార్టీ సెల్ అధ్యక్షుడు బొల్లవరపు జాన్ వెస్లీ అన్నారు. బుధవారం కడలి గ్రామంలో ఏర్పాటు చేసిన అనాథ పిల్లల వసతి గృహం (ఏంజెల్ హౌస్)ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా జాన్‌వెస్లీ మాట్లాడుతూ బిషప్ శ్రావణ్‌కుమార్ అందించిన సేవలు అభినందనీయమన్నారు. కరోనా విపత్కర పరిస్థితుల్లో రాష్ట్ర వ్యాప్తంగా ఎంతో మందిని ఆదుకున్నారన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు కుంచే రమణరావు, సంధ్యారాణి, రాజేష్ పాల్గొన్నారు.

ఎన్నికలకు ఏర్పాట్లు

సఖినేటిపల్లి: నీటి పారుదల వ్యవస్థలో ప్రాదేశిక నియోజకవర్గ సభ్యులు, నీటి వినియోగదారుల సంఘాల అధ్యక్షులు, ఉపాధ్యక్షుల పదవులకు ఎన్నికలకు ఈ నెల 14న అసాధారణ సర్వసభ్య మండలి సమావేశాలు ఏర్పాటు చేసినట్లు రాజోలు డిస్ట్రిబ్యూటరీ కమిటీల ఎన్నికల అధికారి శివశంకర ప్రసాద్ బుధవారం తెలిపారు. ఇందుకు సంబంధించి మండలంలోని మూడు నీటి సంఘాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు.

ఆలమూరు మండల అధికారుల ఫోన్ నంబర్లు

అధికారి పేరు	హోదా	ఫోన్ నంబరు
కేజే ప్రకాష్‌బాబు	తహసీల్దార్	98499 03902
సీహెచ్ విద్యాసాగర్	రావులపాలెం రూరల్ సీఐ	94407 96537
ఎం.అశోక్	సబ్ ఇన్‌స్పెక్టర్	94409 04849
ఎ.రాజు	ఇన్‌చార్జి ఎంపీడీఓ	83175 42815
ఎల్.అనిత	వెటర్నరీ ఏడీ	95503 93727
ఎ.రాజు	ఈఓపీఆర్‌డీ	83175 42815
కె.నాగేశ్వరరావు	ఏడీఏ	83310 56664
ఎస్.లక్ష్మీలావణ్య	మండల వ్యవసాయాధికారి	83310 56557
ఐడి.నాగేశ్వరరావు	ఎక్సైజ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్	97012 87828
జి.అరుణకుమారి	ఎన్ఆర్‌జీఈఎస్ ఏపీఓ	70933 23644
ఎం.ధనరాజు	వెలుగు ఏపీఎం	98499 01696
డి.శ్రీనివాసు	హౌసింగ్ జేఈ	70939 30448
బి,అప్పాజీ	ఎంఈఓ-1	80748 05733
కేవీ సుబ్బరాజు	ఎంఈఓ-2	96189 37973
పి.పద్మ	ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ	91001 21135
పి..శారద	సీడీపీఓ, కొత్తపేట	94408 14683
డి.సువర్చలాదేవి	చొప్పెల్ల పీహెచ్‌సీ	70136 40523
పి.భవానీశంకర్	పెదపళ్ల పీహెచ్‌సీ	88017 87816
టి.కృష్ణ త్రిమూర్తులు	ఇరిగేషన్ జేఈ	83286 29109
జి.భానుప్రసాద్	పశువైద్యాధికారి	95332 87404
పి.రాంబాబు	ఎక్సైజ్ సబ్ ఇన్‌స్పెక్టర్	91609 88844
టీఎస్‌వీ నాగలక్ష్మి	ఐసీడీఎస్ సూపర్‌వైజర్	63099 39852
వై.అరుంధతి	ఐసీడీఎస్ సూపర్‌వైజర్	89778 30575
పి.గోపిరామ్	ప్రభుత్వ ఆసుపత్రి వైద్యాధికారి	93467 87187
డి.వీరభద్రరావు	మండల ఇంజినీరింగ్ జేఈ	83175 43987
వి.వెంకటరమణ	ఆర్అండ్‌బీ జేఈ (మండపేట)	94408 18537
జి.కోటేశ్వరరావు	ఉద్యాన శాఖాధికారి	87126 25210
కె.శివ నాగమల్లేశ్వరరావు	కార్మిక శాఖాధికారి	94925 55059
డీఎస్ఎన్ మూర్తి	అటవీ శాఖాధికారి	98493 52664
పేపకాయల భాస్కరరావు	ఆర్టీసీ డిపో (ఆర్‌సీపురం)	73828 25536
కేడీఎస్ఎన్ కుమార్	ఆర్‌టీసీ డిపో (రావులపాలెం)	99592 25537
డీఎంకే దుర్గాప్రసాద్	ట్రాన్స్‌కో ఏఈ (ఏపీఈపీడీఎల్)	94408 12601
సాయి చంద్రిక	డ్రైన్స్ ఏఈ	88860 66939

జాతీయ రహదారి అభివృద్ధి కోరుతూ ధర్నా



పాశర్లపూడి కొండాలమ్మచింత సెంటర్‌లో ధర్నా చేస్తున్న కాంగ్రెస్ శ్రేణులు

మామిడికుదురు: అధ్వానంగా మారిన 216వ నంబర్ జాతీయ రహదారిని అభివృద్ధి చేయాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బుధవారం పాశర్లపూడి కొండాలమ్మచింత సెంటర్‌లో ధర్నా నిర్వహించారు. జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు కొండేటి చిట్టిబాబు ఆధ్వర్యంలో ఈ ధర్నా జరిగింది. తక్షణం జాతీయ రహదారిని అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలోని జాతీయ రహదారి చాలాకాలం నుంచి పాడైనా అభివృద్ధిని పట్టించుకోవడం లేదని చిట్టిబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం ఆరు నెలల పాలనలో రహదారుల అభివృద్ధిని విస్మరించిందని ఆరోపించారు. ఈ ధర్నాలో పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొత్తూరి శ్రీనివాస్, సీనియర్ నేత మహ్మద్ ఆరిఫ్, మండల శాఖ అధ్యక్షుడు అప్పన శ్రీరామకృష్ణ, అమలాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి అయితాబత్తుల సుభాషిణి, పార్టీ నేతలు మాచవరపు శివన్నారాయణ, నీతిపూడి బాల సత్యనారాయణ, చిట్టాల రామజోగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సత్యనారాయణ సేవలు చిరస్మరణీయం

రాజోలు: మాజీ మునసబు కట్టా సత్యనారాయణ సేవలు చిరస్మరణీయమని మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు అన్నారు. బుధవారం సోంపల్లిలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు, సర్పంచ్ కట్టా శ్రీనివాసరావు తండ్రి సత్యనారాయణ విగ్రహాన్ని గొల్లపల్లి ఆవిష్కరించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సత్యనారాయణ మునసబుగా బాధ్యతలు నిర్వహిస్తూ ఎంతో కీర్తి గడించారన్నారు. తండ్రిని చిరకాలం గుర్తు చేసుకునేందుకు విగ్రహాన్ని ఏర్పాటు చేసిన మండల పార్టీ అధ్యక్షుడు శ్రీనివాసరావును పలువురు నాయకులు అభినందించారు. వైఎస్సార్ సీపీ నాయకులు కోటిపల్లి ఎస్తేరు రాణి, తిరుమానిరాజు, అడబాల జానకీరామ్, కొల్లాబత్తుల సతీష్ తదితరులు పాల్గొన్నారు.



సత్యనారాయణ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి సూర్యారావు